

తూర్పుగోదావరి జట్టు విజయభేరి

కడప వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో సెంట్రల్‌జోన్, తూర్పుగోదావరి జట్లు తలపడ్డాయి.తూర్పుగోదావరి జట్టు 2 వికెట్ల తేడాతో గెలుపొందింది. -8లో



చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

పులివెందులలోని చెన్నారెడ్డి కాలనీలో జులై 17న జరిగిన చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ జీవన్ గంగనాథ్ బాబు తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
29.0/20.6

వాతావరణం

జిల్లాలో బుధవారం 20.6 - 29.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

1న హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో డిసెంబర్ 1వ తేదీ ఉదయం జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ సీనియర్ పురుషుల విభాగం జటుఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె. చిన్నపరెడ్డి, ఎ. సింధూరి తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు డిసెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే వారు 3 పాస్‌పోర్టు సైజుఫొటోలు, ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు.

19 నుంచి శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 19 నుంచి ఫొటో, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్‌లో నెల రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఆసక్తిగల యువకులకు శిక్షణ ఇస్తామన్నారు. గ్రామీణ ప్రాంత యువతకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866, 94409 33028 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

నూతన నియామకం

కడప రూరల్: రాష్ట్ర మాలమహానాడు రామాజీ ఇమ్మానియేల్ వర్గం రాయలసీమ మహిళా అధ్యక్షురాలిగా బండి నీతును నూతనంగా నియమించారు. కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపాక వినోద్‌కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో తమ వర్గం గ్రామ, మండల, జిల్లా స్థాయిలో మరింత చురుగ్గా పనిచేసేందుకు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినయ్ సాగర్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఉల్లి కిరణ్, రాయలసీమ అధ్యక్షుడు మేకల ఓబులేసు, రాయలసీమ సోషల్ మీడియా అధ్యక్షుడు సీకే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వంటింట.. నూనె మంట

- ఎన్నికల తర్వాత కిలో నూనె ధరపై రూ.50 పెంపు
- ఎక్సైజ్ డ్యూటీ పెరగడంతో క్రమం తప్పకుండా పెరుగుదల
- అధిక ధరలతో సామాన్యులు గగ్గోలు



సాక్షి ప్రతినిధి, కడప: కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా దేశంలో భారీగా వంట నూనె ధరలు సలసల కాగుతున్నాయి. ఒకేసారి 24 శాతం ఎక్సైజ్ డ్యూటీ పెంచడంతో కేవలం రెండు నెలల కాలంలో కిలో రూ.50 వరకు పెరిగినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. పక్షం రోజులకు ఓసారి టారిఫ్ మారుతోంది. ఫలితంగా ధరలు పెరుగుతున్నాయి. యుద్ధం నేపథ్యంలో విదేశాల నుంచి రావాల్సిన ముడి చమురు దిగుమతులు తగ్గడం కూడా ఒక కారణంగా తెలుస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే మరికొద్ది రోజుల్లో కిలో వంట నూనె రూ.200 మార్కు దాటినా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు.

- కేంద్ర ప్రభుత్వం వంటింట మహిళలను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఎన్నికల తర్వాత నిత్యావసర సరుకుల ధరలు నియంత్రణలో లేకుండా పోయాయి. ఇందులో ప్రధానంగా వంట నూనె ధరలకు రెక్కలొచ్చాయి. ఎన్నికలకు ముందు మార్చి మాసంలో కిలో పామాయిల్ రూ. 90, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ. 105 ఉండేది. ప్రస్తుతం కిలో పామాయిల్ రూ.140, సన్‌ఫ్లవర్ ఆయిల్ కిలో రూ. 155కు పెరిగింది. కేంద్ర ప్రభుత్వం మలేషియా నూనె ధరల ప్రకారం ధరల మార్కెట్ టారిఫ్ ప్రకటిస్తుంది. ప్రతి 15 రోజులకు ఒకసారి టారిఫ్‌ను కేంద్రం బహిర్గతం చేస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల పామాయిల్‌పై కిలో రూ.18, సన్‌ఫ్లవర్ ఆయిల్ కిలో రూ.30 పెంచారు. ఆరునెలల ఎన్డీయే ప్రభుత్వ హయాంలో కిలోపై దాదాపు రూ.50 వినియోగదారుడికి భారం పడింది.



తెలియకుండానే కోట్లు సమర్పణ..

ఎన్డీయే ప్రభుత్వ నిర్వాకం కారణంగా తెలియకుండానే వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఒక్క వంటనూనె ద్వారానే జిల్లాలో కోట్లాది రూపాయలు కోల్పోతున్నారు. గడిచిన 6నెలల్లో కిలోపైన రూ.50 ధర పెరిగింది. జిల్లాలో దాదాపు 6.5లక్షల కుటుంబాలు ఉన్నాయి. ప్రతి కుటుంబంలో కిలో 2–3కిలోల వంట నూనెలు వాడుతున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వినియోగదారుడికి తెలియకుండానే ప్రతి నెలా రూ.100–150 వరకు భరిస్తున్నారు. ఈలెక్కన ప్రతి నెలా రూ.8కోట్ల పైబడి భరిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.45కోట్లు పైబడి ఎన్డీయే సర్కార్ నిర్వాకం కారణంగా వినియోగదారులు కోల్పోయినట్లు నిపుణులు వివరిస్తున్నారు.

తగ్గిన దిగుమతులు..

విదేశాల నుంచి దిగుమతి కావాల్సిన ముడినూనె తక్కువగా వస్తోంది. మలేషియా నుంచి నూనె ముడిసరుకు ఓడల ద్వారా తెప్పించనున్నారు. అక్కడ నుంచి పైప్‌లైన్ ద్వారా ఫ్యాక్టరీలకు చేరి, తర్వాత ప్యాకెట్లు, డబ్బాల్లో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు పంపిణీ చేస్తారు. మలేషియా నుంచి వచ్చే ఒక్కో ఓడలో దాదాపు రూ.7వందల కోట్లు పైబడి ముడిసరుకు రానున్నట్లు సమాచారం. సముద్రమార్గంలో వచ్చే ఇలాంటి ఓడలకు ఇన్సూరెన్స్ చేస్తారు. ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ ఆయా కంపెనీలు భరించనున్నాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇన్సూరెన్స్ కంపెనీలు ఓడలకు ఇన్సూరెన్స్ తాత్కాలికంగా నిలిపేసినట్లు సమాచారం.దీంతో వ్యాపారులు దిగుమతులకు దూరంగా ఉన్నారని తెలుస్తోంది. పైగా కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ ఇటీవల 24 శాతం పెంచింది. ఫలితంగా నూనె ధరలు పెరుగుతున్నాయి. ఈప్రభావం టిఫిన్, భోజనాలు, రెస్టారెంట్లు, క్యాటరింగ్‌లపై పడింది. ఆయా ధరలు భారీగా పెరిగాయి. గృహిణులు నూనె ధరలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నూనె ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పిండి వంటలు చేసుకోలేక పోతున్నాం



మేము కూలి పని చేసుకొని జీవించేవాళ్లం. మా ఇంట్లో నెలలో కనీసం నాలుగైదు సార్లు పిండి వంటలు చేసేవారు. అయితే ఇటీవల వంట నూనెల ధరలు భారీగా పెరగడంతో అవసరమైన మేరకే కూరలు, వేపుళ్లు చేసుకుంటున్నాం. పిండి వంటలు చేయమని పిల్లలు అడుగుతున్నా చేసుకోలేని పరిస్థితి ఉంది. రెండు నెలలుగా నూనె ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎలా జీవించాలి. ప్రభుత్వం చర్యలు తీసుకొని సామాన్యులకు వంట నూనెల ధరల నుంచి విముక్తి కలిగించాలి. – నబీరసూల్, బైపాస్‌రోడ్డు, ఈశ్వరరెడ్డినగర్, ప్రొద్దుటూరు

నూనె ధరలు తగ్గించాలి



టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాను. వంట నూనె ధరలు పెరగడంతో మాకు పనికి తగ్గ ఫలితం దక్కడం లేదు. ఒకవేళ టిఫిన్ రేట్లను పెంచితే కస్టమర్లు రారే మోనని భయం.ప్రభుత్వం వంట నూనెధరలు తగ్గించాలి -బి.రాజేష్, ఎంఎస్ టిఫెన్‌సెంటర్,హౌసింగ్‌బోర్డు కాలనీ, కడప

మధ్య తరగతి కుటుంబాలకు భారం



రోజు రోజుకు పెరుగుతున్న వంట నూనెల ధరలతో మా లాంటి పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి.ఇప్పటికైనా ప్రభుత్వాలు వంటనూనెల ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. – ఎన్. లక్ష్మీదేవి, అమృతానగర్, ప్రొద్దుటూరు

వంట నూనె ధరల పెంపు దారుణం



వంట నూనె ధరలను కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పెంచడం దారుణం. పేదలు అధికంగా వినియోగించే పామాయిల్ ధరను కూడా పెద్ద ఎత్తున పెంచడం తగదు. నెల రోజుల వ్యవధిలో ధరలు అమాంతంగా పెరగడంతో పేదలు, మధ్యతరగతి వర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు పెరిగి అల్లాడుతున్న తరుణంలో మళ్లీ వంట నూనె ధరలు పెంచడం సరికాదు. – పావని, గృహిణి, ఇందిరానగర్, చింతకొమ్మదిన్నె మండలం

పదిలో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి

డీఈఓ మీనాక్షి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి

కడప ఎడ్యుకేషన్: రానున్న పదో తరగతి పరీక్షల్లో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని, ఇందుకోసం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి పేర్కొన్నారు. బుధవారం కడపలోని నగర పాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మరింత మెరుగ్గా భోజనాన్ని అందించాలన్నారు. అలాగే తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు సంబంధించిన రికార్డులను అప్‌డేట్‌గా ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ విద్యాశాఖ నుంచి వచ్చే అన్ని రకాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డిసెంబర్ 7వ తేదీ జరిగే మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాన్ని ప్రతి పాఠశాలలో విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ ఇలియాస్‌బాషా, ఉపాధ్యాయులు ఖాజాపీర్, ఎస్ఎండీ అయూబ్, జకీరా ఖానమ్, మహబూబ్‌బాషా, వ్యాయామ ఉపాధ్యాయుడు సాజిత్, ఆదిమూలం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితం మాటున అనుచితం



- గ్యాస్ ఏజెన్సీల దోపిడీ
- ఈకేవైసీ పేరిట డబ్బుల వసూలు
- పట్టించుకోని అధికారులు



కడప సెవెన్‌రోడ్స్: అర్హులైన ప్రతి వినియోగదారునికి సంవత్సరానికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీపం–2 పథకం గ్యాస్‌ఏజెన్సీ నిర్వాహకులకు అయాచిత వరంగా మారింది. వినియోగదారుల నుంచి అక్రమ వసూళ్లకు తెరలేపారు. పౌరసరఫరాల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- గతనెల 31న ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. అదేనెల 29 నుంచి గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రారంభమైంది. ఉచిత సిలిండర్లు మూడు బ్లాకుల్లో పంపిణీ చేస్తారు. ప్రస్తుతం మొదటి బ్లాక్ బుకింగ్ కావడంతో వినియోగదారుల్లో సహజంగా ఆతృత ఏర్పడి ఏజెన్సీ నిర్వాహకుల వద్దకు క్యూ కడుతున్నారు. వీరికి ఏజెన్సీ నిర్వాహకులు ఉచితంగా ఈకేవైసీ చేయాల్సి ఉంటుంది. వినియోగదారులు ఏజెన్సీ వద్దకు గ్యాస్ పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకు వెళితే ఈకేవైసీ కోసం రూ. 50 చొప్పున రాబడుతున్నారు. అంతకుమునుపే ఈకేవైసీ చేయించుకుని ఉన్నప్పటికీ నిరక్షరాస్యులైన చాలామంది వినియోగదారులకు ఆ విషయం గురించి తెలియదు. ఇప్పుడు మళ్లీ చేయించుకోవాలే అని అనుకుంటున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని వేలిముద్ర లేదా ఐరిస్ తీసుకుంటున్నట్లు నటిస్తూ ఏజెన్సీ నిర్వాహకులు డబ్బులు గుంజుతున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు అవసరం లేకున్నా గ్యాస్ పైపులు వినియోగదారులకు బలవంతంగా అంటగడుతున్నారు. నిజానికి ఒక పైపు జీవితకాలం ఐదు సంవత్సరాలు ఉంటుంది. వినియోగదారుని వద్ద ఉన్న గ్యాస్ పైపునకు కాలం చెల్లకపోయినా తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని అంటున్నారు. వినియోగదారులు బయటి మార్కెట్‌లో గ్యాస్ పైపు తాజాగా కొనుగోలు చేసి ఉన్నాసరే ఏజెన్సీల నిర్వాహకులు రూ. 150 చొప్పున వసూలు చేస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇలా ఒక్కో వినియోగదారునిపై రూ. 200 చొప్పున ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. కడప నగరంలో ఈ వ్యవహారం యథేచ్ఛగా నడుస్తున్నా పౌరసరఫరాల అధికారులు తమ బాధ్యత కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

సబ్సిడీ జమకాక అగచాట్లు



బియ్యం కార్డు, ఆధార్, యాక్టివ్ ఎల్‌పీజీ కనెక్షన్, అదర్ డిపార్టుమెంట్ డేటా బేస్‌తో మ్యాచ్ అయి ఉన్న వారిని దీపం–2 కింద అర్హత కలిగిన వినియోగదారులుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు జిల్లాలో 4,28,318 ఎలిజిబుల్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రసుతం 1,62,723 గ్యాస్ సిలిండర్లు డెలివరీ అయ్యాయి. ఇందులో 1,50,277 మందికి సబ్సిడీ రిలీజ్ కాగా, 1,30,476 మంది అకౌంట్లకు సబ్సిడీ క్రెడిట్ అయింది. ఈ క్రమంలో పలుచోట్ల కొందరు వినియోగదారులు తమకు కేంద్రం ఇస్తున్న రూ. 43 అకౌంటులో పడిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ. 809 రాలేదంటున్నారు. మరి కొందరు రోజులు గడుస్తున్నా ఎలాంటి సబ్సిడీ మొత్తం తమ ఖాతాల్లో జమ కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు సబ్సిడీ జమ కాలేదని వినియోగదారులు ఏజెన్సీ నిర్వాహకుల వద్దకు వెళుతుంటే అది తమకు సంబంధం లేదని చెబుతున్నారు. దీంతో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాలేదని వాపోతున్నారు.

అధికారుల బాధ్యతారాహిత్యం



వంట గ్యాస్ ఏజెన్సీలు అవసరం లేకపోయినా పైపులు తీసుకోవాలంటూ బలవంతంగా అంటగడుతున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా పౌరసరఫరాల అధికారులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. అలాగే ప్రతి వినియోగదారుని నుంచి రూ. 200 చొప్పున వసూళ్లకు పాల్పడుతున్నారు. అధికారులు స్పందించడం లేదంటే వారికీ వాటా అందుతోందనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇప్పటికైనా స్పందించకపోతే ఆందోళనలు చేపడతాం. – ఎస్.వెంకట శివ, సీపీఐ నగర కార్యదర్శి, కడప

పర్యవేక్షణ లోపమే



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం–2 పథకం అమలులో క్షేత్ర స్థాయిలో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఏజెన్సీల అక్రమ దందాలు, సిలిండర్లు బుక్ చేసుకున్న 48 గంటల్లో సబ్సిడీ మొత్తాలు అకౌంట్లకు జమ కాకపోవడం వంటి సమస్యలతో వినియోగదారులు సతమతమవుతున్నారు. క్షేత్ర స్థాయిలో నెలకొన్న ఇలాంటి సమస్యలను ఎప్పటికప్పుడు తమ పర్యవేక్షణ ద్వారా పరిష్కరించాల్సిన అధికారులు మిన్నకుండిపోవడం దారుణం. – కె.రామాంజనేయులు, అధ్యక్షులు, ఏపీ దళితమిత్ర సంఘం

పంటలకు బీమా చేయించుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

ఎర్రగుంట్ల: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రైతులు తప్పనిసరిగా పంట బీమా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని హనుమనుగుత్తి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 15వ తేదీ లోగా పంటల బీమా చేయించుకోవాలన్నారు. బ్యాంకులో రుణం తీసుకున్న వారు బ్యాంకులోని ఫీల్డ్ అధికారిని సంప్రదించి అక్కడే పంటల బీమా చేయించుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో కమలాపురం వ్యవసాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్‌రెడ్డి , వ్యవసాయ సహాయకుడు పవన్, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

14 మంది జూదరుల అరెస్టు

గుర్రంకొండ : మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో 14 మంది జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం గ్రామానికి సమీపంలోని హంద్రీ నీవా కాలువ పరిసరాల్లో జోరుగా జూదం నిర్వహిస్తున్నారనే సమాచారం అందుకొన్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 14 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 42,850 తోపాటు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేశామన్నారు.

పాలతలలో హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

పెండ్లిమర్రి : పాలతల శైవ క్షేత్రంలోని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానం హుండీల ఆదాయాన్ని బుధవారం దేవదాయశాఖ సూపరింటెండెంట్ రమణమ్మ ఆధ్వర్యంలో లెక్కించారు. అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారి హుండీ ఆదాయం, కానుకలు లెక్కించగా రూ.31,84,872 నగదు,4కేజీలు వెండి, 35 గ్రాములు బంగారు వచ్చిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు గురువారం మల్లేశ్వరస్వామి, పార్వతీదేవి అమ్మవార్ల హుండీ కానుకలను లెక్కిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ 29కి వాయిదా

కడప అర్బన్ : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి తనపై మోపిన అభియోగాలకు సంబంధించిన కేసుపై ముందస్తు బెయిల్ పిటిషన్ కడపలోని జిల్లా కోర్టులో దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరగాల్సి ఉంది. మెజిస్ట్రేట్ ఈ విచారణను 29కి వాయిదా వేశారు. అదే రోజున ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న వర్రా రవీంద్రారెడ్డిని పోలీస్ కస్టడీకి కోరిన పిటిషన్ విచారణ కూడా జరగనుంది.

ఆసుపత్రిలో అగ్నిప్రమాదం



ఆసుపత్రిలోని ల్యాబ్‌లో ఎగిసిపడుతున్న మంటలు

కడప అర్బన్ : కడప నగరం శంకరాపురం పరిధిలోని మద్రాస్‌రోడ్డులో మామిళ్లపల్లి నాగప్రశాంతి హాస్పిటల్‌లో గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఫార్మసీలో అగ్నిప్రమాదం జరిగింది. సమాచారాన్ని అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని అగ్నిప్రమాదాన్ని నివారించారు. సంఘటన సమయంలో హాస్పిటల్‌లో పేషెంట్లు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల మేరకు ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపకశాఖ జిల్లా సహాయ అధికారి బసివిరెడ్డి తెలిపారు. సంఘటన స్థలాన్ని కడప చిన్నచౌక్ ఎస్ఐ ఎస్.రాజరాజేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పరిశీలించారు.

తహసీల్దార్ అవినీతిపై సబ్ కలెక్టర్ విచారణ

మదనపల్లె : మండల తహసీల్దార్ ఖాజాబీ అవినీతిపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఫిర్యాదు మేరకు, కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాలతో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ విచారణ నిర్వహించారు. బుధవారం సబ్ కలెక్టరేట్‌లో మండల వీఆర్వోలను పిలిపించి, ఒక్కొక్కరిని పంచాయతీల వారీగా వారి పరిధిలో జరిగిన మ్యుటేషన్లు, ఆన్‌లైన్, పాసు పుస్తకాల జారీ, ఫ్రీహోల్డ్ భూముల వెరిఫికేషన్, ఎన్‌ఓసీలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖాజాబీ తహసీల్దార్‌గా వచ్చిన తర్వాత కార్యాలయంలో జరిగిన లావాదేవీలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీపై వచ్చిన ఫిర్యాదులన్నింటిపై విచారించారు. విచారణలోని అంశాలపై కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు సబ్ కలెక్టర్ తెలిపారు.

తూర్పుగోదావరి జట్టు విజయభేరి



నాటౌట్‌గా సౌత్‌జోన్ బ్యాట్స్‌మన్ రేవంత్‌రెడ్డి



6 వికెట్లు తీసిన సెంట్రల్ జోన్ బౌలర్ మానస్



తలపడుతున్న సెంట్రల్‌జోన్, తూర్పుగోదావరి జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్‌ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో సెంట్రల్‌జోన్, తూర్పుగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన రెస్టాఫ్ సెంట్రల్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 38.2 ఓవర్లలో 129 పరుగుల వద్ద సెంట్రల్‌జోన్ జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని సమన్విత్ 35, దుర్గారావు 24 పరుగులు చేశారు. తూర్పుగోదావరి బౌలర్లు సందేష్ 4, శివసూర్య 2, వంశీనారాయణ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 32.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసి విజయభేరి మోగించింది. జట్టులోని విజయ్ 51, పాండురంగరాజు 32 పరుగులు చేశారు. సెంట్రల్‌జోన్ బౌలర్ మానస్ 6 వికెట్లు తీశాడు. కాగా తూర్పుగోదావరి జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్టు విజయం..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో ప్రకాశం, రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ప్రకాశం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 37 ఓవర్లలో 221 పరుగుల వద్ద ప్రకాశం జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని రోహిత్ 67, అభినవ్ 38 పరుగులు చేశారు. సౌత్‌జోన్ బౌలర్లు సుతేజ్ రెడ్డి 4, మాధవ్ 3, ధరణికుమార్ నాయుడు 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ జట్టు 36.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని రేవంత్‌రెడ్డి 101 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్సర్‌తో 99 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. తేజారెడ్డి 55 పరుగులు చేశాడు. దీంతో రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్టు 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

రెస్టాఫ్ నార్త్‌జోన్ విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, రెస్టాఫ్ నార్త్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంత జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 27.4 ఓవర్లలో 97 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని అర్జున్ టెండూల్కర్ 45, జయకృష్ణ 14 పరుగులు చేశారు. నార్త్‌జోన్ బౌలర్లు శ్రీకర్‌సాయి రెడ్డి 4, అచ్యుత్‌హేమంత్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు 14.2 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 101 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని హిమకర్ 56, హర్షవర్ధన్ 34 పరుగులు చేశారు. దీంతో నార్త్‌జోన్ జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

పెళ్లి పేరుతో మోసం చేశాడు

ఓ బాధితురాలి ఆవేదన



విలేకరులతో మాట్లాడుతున్న బాధితురాలు షేక్ ఉమ్మి సల్మా

కడప రూరల్ : పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఓ బిడ్డకు తల్లిని చేసి ఇప్పుడు వేధింపులకు గురి చేస్తున్నాడంటూ ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేస్తోంది. బుధవారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో షేక్ ఉమ్మి సల్మా అనే బాధితురాలు తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. కడప నగరం రవీంద్రనగర్‌కు చెందిన తాను భర్తనుంచి విడాకులు తీసుకుని జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లేందుకు కడప నగరం కృష్ణా సర్కిల్‌లోగల జేకే ట్రావెల్స్‌లో సంప్రదించానని తెలిపారు. అయితే ఆ ట్రావెల్స్ ఏజెంట్ తనకు మాయమాటలు చెప్పి విదేశాల్లో పరిస్థితులు బాగా లేవని, తన వద్దనే పని చేస్తే నెలకు రూ.20 వేలు ఇస్తానని నమ్మబలికాడన్నారు. తనను విదేశాలకు వెళ్లే వారిని చెన్నైకి తీసుకెళ్లి ఫ్లైట్ ఎక్కించడం తదితర పనులను అప్పగించారన్నారు. ఈ క్రమంలో అతను తనను వివాహం చేసుకుంటానని నమ్మబలికి శారీరక సంబంధం కొనసాగించాడన్నారు. తాను గర్భం దాల్చగా వివాహానికి కుంటిసాకులు చెబుతూ తప్పించుకునేవాడన్నారు. అనంతరం తనకు గతంలోనే వివాహమైందని, రూ.5 లక్షలు తీసుకుని వెళ్లిపోవాలని సూచించాడన్నారు. ఎట్టకేలకు తనను వివాహం చేసుకున్నప్పటికీ తీవ్రంగా కొట్టడం, హింసించడం చేసేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్ల పుట్టిందనే సాకుతో వేధింపులు మరింత అధికమయ్యాయన్నారు. తనకు, తన బిడ్డకు న్యాయం చేసి ఆదుకోవాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో బాధితురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప భక్తులకు గాయాలు

రాయచోటి : రాయచోటి– చిత్తూరు మార్గంలోని సంబేపల్లి మండలం ఎర్రగుంట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 20 మంది అయ్యప్ప భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. విజయనగరం నుంచి 50 మంది అయ్యప్ప స్వాములు స్వామి దర్శనానికి వెళ్తున్న సమయంలో బుధవారం తెల్లవారుజామున ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ప్రమాదం లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే సంభవించినట్లు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. స్వల్పంగా గాయపడిన 20 మందికి రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించామన్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక



జాతీయ స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రత్యేక అధికారిణి

అట్లూరు : అట్లూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు అండర్–14 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్‌లో జాతీయ స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రత్యేక అధికారిణి ఫణిశ్రీ, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీల తెలిపారు. చిత్తూరు జిల్లా అరగొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో బి.లక్ష్మిప్రసన్న జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. అలాగే చిత్తూరు జిల్లా మంగళంలోని నిర్వహించిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ టోర్నమెంట్‌లో బి. తనూజ అనే విద్యార్థిని జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. దీంతో ఆ ఇరువురు విద్యార్థినులను ప్రత్యేక అధికారి అభినందించారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

105 గ్రాముల బంగారు, 116 గ్రాముల వెండి స్వాధీనం



దొంగతనం కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ జీవన్ గంగానాథ్ బాబు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో విశ్వనాథ రెడ్డి అనే ఉపాధ్యాయుడి నివాసంలో జులై 17న జరిగిన చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ జీవన్ గంగనాథ్ బాబు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు సొంత పని నిమిత్తం కడపకు వెళ్లగా.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న 105 గ్రాముల బంగారు, 116 గ్రాముల వెండి వస్తువులను దొంగిలించారన్నారు. అప్పట్లో కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ, డీఎస్పీ మురళి నాయక్ ఆదేశాల మేరకు రెండు బృందాలుగా విడిపోయి దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. అందులో భాగంగా పట్టణంలోని ముద్దనూరు రింగ్ రోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న లింగుటేరీ రాంబాబు, నడింపల్లి గోపి, సోను కుమార్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. వారి వద్ద నుంచి 105 గ్రాముల బంగారు, 116 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో హెడ్ కానిస్టేబుళ్లు వేణుగోపాల్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు నచ్చిన రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు మ్యాజిక్ చేసి చూపిస్తున్న జేవీవీ ప్రధాన కార్యదర్శి బాల బయన్న

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులు తమకు నచ్చిన రంగాలను ఎంచుకుని అందులో రాణించేందుకు కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి బాల బయన్న అన్నారు. బుధవారం కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ అండ్ మ్యాజిక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చదువు బాగుంటే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగమణి, జన విజ్ఞాన వేదిక నగర ఉపాధ్యక్షుడు అబ్దుల్ రాయల్ కరీముల్లా, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దామోదర్, ముఖర్జీ, రామ్మోహన్ నాయక్, నరసారెడ్డి విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి తీవ్ర గాయాలు





తీవ్రంగా గాయపడిన నాగేశ్వర్‌రెడ్డి, చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

బి.కోడూరు : తన పొలంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి ఓ రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని ప్రభలవీడు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కత్తెరపల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డిల పొలంలో వెళుతున్న 11 కేవీ విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో ఉన్నాయి. ఈ విషయం పలుమార్లు ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. బుధవారం ఉదయం నాగేశ్వర్‌రెడ్డి తన పొలంలో వరికోత మిషన్‌తో వరి పంటను కోసే క్రమంలో ఆ విద్యుత్ వైర్లు పొరపాటున నాగేశ్వర్‌రెడ్డికి తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన వైద్యం కోసం కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ తీగలకు మరమ్మతులు చేసి పునరుద్ధరించాలని గత సంవత్సరం రోజులుగా విద్యుత్ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గాయపడిన రైతుకు నష్టపరిహారం విద్యుత్ అధికారులే చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రచారంపై ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి సూచనల మేరకు జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ బుధవారం కడపలోని న్యాయసేవాసదన్‌లో బాల వివాహ ముక్త్ భారత్ ప్రచారం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అన్నారు. పిల్లలు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్‌లు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో..

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్ వివాహ ముక్త్ భారత్ ప్రచారం సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూ ఢిల్లీ నుంచి గౌరవ మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వివాహ వయసుపై అవగాహన కల్పించారు. బాలికలకు మంచి విద్యను అందించే బాధ్యత తల్లిదండ్రులదన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆవరణలో వృద్ధుడి మృతి



మృతి చెందిన వృద్ధుడు నరసింహులు

మదనపల్లె : మదనపల్లె సర్వజన బోధనాసుపత్రి ఆవరణలో వృద్ధుడు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. మండలంలోని చీకలబైలు పంచాయతీ కోళ్లవారిపల్లెకు చెందిన నరసింహులు(68) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసేవాడు. కొంతకాలంగా అనారోగ్యానికి గురికావడంతో పనులకు వెళ్లలేక ఇంటిపట్టునే ఉండేవాడు. ఈనెల 23, 25 తేదీల్లో జిల్లా ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాడు. మరోసారి బుధవారం ఉదయం చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. ఓపీలో వివరాలు నమోదు చేసుకుని, ఆస్పత్రి ఆవరణలోని చింతచెట్టు కింద ఉండగా, అకస్మాత్తుగా కిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది విషయాన్ని ఆర్ఎంఓ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశాలతో అత్యవసర విభాగ వైద్యురాలు డాక్టర్ లక్ష్మీకళ వృద్ధుడిని పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీ గదిలో ఉంచి, అతడి వద్ద ఉన్న వివరాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

టౌన్ సర్వేయర్‌పై ఫోర్జరీ కేసు నమోదు

సస్పెండ్ చేయాలని కోరుతూ డిపార్ట్‌మెంట్‌కు లేఖ రాసిన కమిషనర్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న టౌన్ సర్వేయర్ జీఎల్ఎన్ రవికిశోర్‌పై స్థానిక వన్ టౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. టౌన్ సర్వేయర్ రవికిశోర్ సర్వేకు సంబంధించిన ఫేక్ చలానాలను తయారు చేసి ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లేలా చేశారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సంతకాన్ని ఫోర్జరీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఫిర్యాదుతో ఇటీవల ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పలువురు బాధితులు కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సర్వేయర్ రవికిశోర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫేక్ చలానాలను తయారు చేయడంతోపాటు ఫోర్జరీ సంతకాలు చేస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని కమిషనర్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం టౌన్ సర్వేయర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. అలాగే సర్వేయర్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ సర్వే ఆఫ్ సెటిల్‌మెంట్ ల్యాండ్‌రికార్డ్స్ (ఎస్ఎస్ఎల్ఆర్) కమిషనర్‌కు మున్సిపల్ కమిషనర్ మలికార్జున లేఖ రాశారు. సబ్ రిజిస్ట్రార్ అధికారులకు కూడా కమిషనర్ ఇదే విషయాన్ని తెలిపారు.

ఉత్తమ డ్రైవర్లుగా రాణించాలి



సర్టిఫికెట్లు పొందిన అభ్యర్థులతో ఆర్టీసీ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలులో శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదిగి ఉత్తమ డ్రైవర్లుగా మారాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి, డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు ఆకాంక్షించారు. బుధవారం కడప నగరంలో ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న 22వ బ్యాచ్ అభ్యర్థులకు భారతి సిమెంట్స్ ప్రతినిధి భార్గవరెడ్డి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం ఏ వృత్తిలో ఉన్నా చిత్తశుద్ధితో పనిచేస్తే దేశం గర్వించే స్థాయికి చేరవచ్చన్నారు. ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలులో అత్యుత్తమ శిక్షణ పొందిన అభ్యర్థులు ఆ వృత్తిలో రాణించి సంస్థకు మంచి పేరు తేవాలని సూచించారు. రాబోయే బ్యాచ్‌లో శిక్షణ పొందగోరు నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్తగా డ్రైవింగ్ శిక్షణ తీసుకోబోయే అభ్యర్థులు 99592 25774, 73828 65145 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా

డిసెంబర్ 15న బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్

మదనపల్లె : వక్ఫ్ సవరణ బిల్లును తిరస్కరిస్తూ ముస్లిం సంఘాలు, వివిధ పార్టీలు, ప్రజాస్వామిక సంస్థలు ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వక్ఫ్ సవరణ బిల్లు తిరస్కరణకు మద్దతు కోరుతూ డిసెంబర్ 15న కడపలో జమాతే–ఉలేమా–ఇ–హింద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ తమ సంఘీభావం తెలపాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ పేర్కొన్నారు. పట్టణంలోని నక్కలదిన్నె ఈద్గాలో మంగళవారం రాత్రి రాయచోటి ముఫ్తీ మసూమ్ అధ్యక్షతన కడప సభ విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ముస్లిం పెద్దలు, ఉలేమాలు, ముతవలీల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో నిసార్ అహ్మద్ మాట్లాడుతూ.. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ముస్లింల హక్కులను కాలరాస్తోందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు ఇస్లామిక్ చట్టం, ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు దారుణమని..రాజ్యాంగ స్ఫూర్తిపై దాడిగా పేర్కొంటూ, బిల్లు వివక్షతో కూడుకోవడమే కాకుండా ఏకపక్షంగా ఉందన్నారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుతో కేంద్ర ప్రభుత్వం దేశాన్ని విభజిస్తోందని, ముస్లింలకు కేంద్రం శత్రువు అని చెప్పేందుకు ఈ బిల్లే సాక్ష్యమన్నారు. ఇది మతపరమైన విభజనను సృష్టిస్తుందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ డిసెంబర్ 15న జమాతే–ఉలేమా–ఇ–హింద్ ఆధ్వర్యంలో కడపలో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

రాయచోటి అర్బన్ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకవైపు దేశవ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రజలు ఘనంగా జరుపుకుంటున్న తరుణంలో కొందరు దుండగులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నేతలు సురేంద్రకుమార్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫలితాల్లో ఎందుకు బెస్ట్ ఉండటం లేదు?

విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కోన శశిధర్

అనంతపురం ఎడ్యుకేషన్ : 'రేకుల షెడ్లలో నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్లకు వేలాది రూపాయల ఫీజులు కట్టి పిల్లలను పంపుతున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారు. బెస్ట్ టీచర్లు, బెస్ట్ స్టూడెంట్స్, బెస్ట్ సౌకర్యాలు ఉన్నాయి. మరి ఫలితాల్లో బెస్ట్ ఎందుకు ఉండడం లేదు' అని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కోన శశిధర్ అన్నారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన అనంతపురం రూరల్ పరిధిలోని సీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల నుంచి ఎంపిక చేసిన ఎంఈఓలు, హెచ్ఎంలకు జరుగుతున్న 'లీడర్‌షిప్' శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకత్వ లోపాలతోనే పాఠశాలల్లో ఆశించిన ఫలితాలు రాలేదన్నది వివిధ సర్వేల్లో తేలిందన్నారు. దీంతో శిక్షణ అనేది దేశ వ్యాప్తంగా తప్పనిసరి చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలలంటే తల్లిదండ్రుల్లో నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించాల్సి ఉందన్నారు. లేదంటే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. విద్యా వ్యవస్థలో ప్రస్తుతం దాదాపు 45 యాప్‌లు ఉన్నాయని, అన్నీ కలిపి ఒక ట్రెండ్ యాప్‌లు చేసేలా చూస్తున్నామని చెప్పారు. ఈ రెండు యాప్‌లలోనే అన్ని అంశాలూ ఉంటాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల అకడమిక్ ప్రోగ్రెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ అయినా ఉపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్, డీఈఓ ప్రసాద్ బాబు, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజు, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఓ నాగరాజు, సీఎంఓ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

రూ.8.68 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్ : సత్యసాయి జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రత్న వెల్లడించారు. పట్టుబడిన వారిలో అనంతపురం నగరంలోని అనంతసాగర్ కాలనీకి చెందిన షికారి కోటయ్య, షికారి శ్యాలీ అలియాస్ శ్యామ్, షికారి శీన అలియాస్ అర్జున్ ఉన్నారు. వ్యసనాలకు బానిసలైన వీరు తమ అవసరాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు తెగబడ్డారు. పుట్టపర్తి రూరల్, గోరంట్ల, సోమందేపల్లి, కదిరి ప్రాంతాల్లో ఇటీవల జరిగిన పలు చోరీ కేసుల దర్యాప్తులో భాగంగా బుధవారం పుట్టపర్తి సమీపంలోని కర్ణాటకనాగేపల్లి వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేయడంతో తాము చేసిన దొంగతనాలను వారు అంగీకరించారు. వీరి నుంచి రూ 7.68 లక్షలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, రూ. లక్ష నగదు, ఓ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, జిల్లాతో పాటు అనంతపురం, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలలో పలు చోట్ల దొంగతనాలు చేసి పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది.